క్లుప్తంగా

పీరీల పండుగ ప్రారంభం



పీరీలను దర్శించుకుంటున్న ఎస్సై, భక్తులు

వాజేడు: మండల పరిధిలోని పేరూరు గ్రామంలో ఆదివారం పీరీల(మొహర్రం) పండుగ ప్రారంభమైంది. పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్‌తో పాటు గ్రామస్తులు పీరీలను దర్శనం చేసుకున్నారు. 10 రోజుల పాటు పీరీల పండుగ జరగనుండగా జూలై 3 నుంచి గ్రామాల్లో పీరీలను ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



భూమి పూజలో పాల్గొన్న నాయకులు

కన్నాయిగూడెం: మండలంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అప్సర్ పాషా అన్నారు. ఆదివారం మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నాయకులు భూమి పూజ చేసి ముగ్గు పోశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గం ప్రభాకర్, రాంబాబు, సాంబశివ, కృష్ణ, సుమన్, రమేశ్, సాంబయ్య, రవీందర్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

మల్హర్: మండలంలోని కొండంపేట గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చల్లా మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కుంభం ముకంద రెడ్డి ప్రధానకార్యదర్శిగా శనిగారపు బాపు, అధికార ప్రతినిధిగా శనిగారపు రమేశ్, కోశాధికారిగా బద్ది మల్లయ్య, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గా తోడే లక్ష్మణ్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొండ రాజమ్మ, మాజీ సర్పంచ్ పోటు ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కాటారం: మండలంలోని దామెరకుంటకు చెందిన యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పసుల శ్రీనివాస్ ఆ దివారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య పరామర్శించారు. శ్రీనివాస్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రఘువీర్, నాయకులు ఆకుల చందు, కుమార్, వెంకట్రాజం, సాయి, బాపు, సాగర్, ప్రవీణ్, లింగయ్య, ఉన్నారు.

అన్నదాతలకు పెట్టుబడి భారం

- సాగులో ట్రాక్టర్ల వినియోగం
- కనుమరుగవుతున్న కాడెడ్లు
- పెరుగుతున్న ఖర్చులు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

వెంకటాపురం(కె): రైతుల పరిస్థితి నానాటికి దిగజారుతుంది. సాగులో యంత్రాల వినియోగం పెరగడంతో పెట్టుబడి ఖర్చులు అధికమవుతున్నాయి. కాడెడ్లను వినియోగించాల్సిన రైతు ప్రస్తుత పరిస్థితుల్లో ట్రాక్టర్లు, పవర్ టిల్లర వినియోగం పెరిగింది. తక్కువ సమయంలో సాగు పనులు పూర్తి అవుతుండటంతో రైతులు వీటిపైనే ఆధారపడాల్సి వస్తుంది. కాగా యంత్రాల వినియోగంతో పెట్టుబడి ఖర్చులు పెరగటంతో రైతులకు భారంగా మారింది. కాగా బ్యాంక్ రుణాలు సకాలంలో అందక పోవటంతో చాలా మంది రైతులు సాగులో వెనుకబడుతున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో ట్రాక్టర్‌తో దుక్కి దున్నినందుకు ఎకరాకు రూ.1000 నుంచి రూ.1200 తీసుకుంటున్నారు. దీంతో ఖర్చులు పెరిగి చిన్న రైతులకు పెట్టుబడి భారంగా మారుతుంది. అలాగే పొలాల్లో గెట్లు తీసేందుకు బ్లైడ్ ట్రాక్టర్‌ను ఉపయోగిస్తున్నారు. చీడ పీడల బెడదకు మందులు పిచికారీ చేసేందుకు డ్రోన్‌లను, కోతల సమయంలో వరికోత యంత్రాలను వాడుతున్నారు. దీనికి తోడు ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరగటంతో రైతులకు పెట్టు బడి భారంగా మారిందని వాపోతున్నారు.

ఖర్చులు పెరిగాయి



సాగుకు ఖర్చులు భారీగా పెరిగాయి. సాగులో ప్రతి పనికి యంత్రాలను వినియోగించడంతో అదనంగా ఖర్చులు అవుతున్నాయి. కాడెడ్లను కొనుగోలు చేయాలన్న వటి ధరలు చూస్తే భయం వేస్తుంది. కూలి రేట్లు సైతం పెరగటంతో ఇబ్బందులు పడుతున్నాం.

- కొప్పుల కృష్ణ, రైతు

అనుమతులు రాకున్నా భూమిపూజ

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



మాట్లాడుతున్న పుట్ట మధు

మల్హర్: కిషన్ రావుపల్లి అటవీ ప్రాతంలో రోడ్డు నిర్మాణానికి ఫారెస్ట్ క్లియరెన్స్ రాకున్నా మంత్రి శ్రీధర్‌బాబు భూమి పూజ చేయడం విడ్డూరంగా ఉందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. మండలం కేంద్రం తాడిచర్ల గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పెద్దతూండ్ల కిషన్‌రావుపల్లి అటవీ ప్రాతం నుంచి భూపాలపల్లి వన్ ఇన్‌క్లైన్ మైన్ వరకు నిర్మించే రోడ్డుకు ఫారెస్ట్ నుంచి పూర్తి స్థాయిలో అనుమతులు రాలేదని తెలిపారు. కానీ స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలను మభ్య పెట్టేందుకే రోడ్డు నిర్మాణానికి ఆర్భాటాల మధ్య మంత్రి శంకుస్థాపన చేశారని విమర్శించారు. 2023 సంవత్సరం సెప్టెంబర్ నెలలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్టేజ్1 క్లియరెన్స్‌కు ఆర్డర్ కాపీ తీసుకువస్తే అక్టోబర్ నెలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిందన్నారు. ఈ క్రమంలో తాము ఫారెస్ట్‌కు చెల్లించాల్సిన రూ.4.70 కోట్లు చెల్లించలేకపోయామన్నారు. అటు తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో శ్రీధర్‌బాబు మంత్రిగా ఉండి ఫారెస్ట్‌కు రూ.4.70 కోట్లు చెల్లించడానికి 17నెలలు ఆలస్యం చేశారని పేర్కొన్నారు. అయిన ఫారెస్ట్‌కు డబ్బులు చెల్లించినప్పటికీ పూర్తి స్థాయిలో ఫారెస్ట్ క్లియరెన్స్ రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు జాగరి హరీష్, మండల నాయకులు కోట రవి గౌడ్, తాజొద్దీన్, వాల యాదగిరిరావు, అయూబ్ ఖాన్, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అక్కినవేని సుమన్, రాజేశ్వర్ రావు, సత్యనారాయణ, నాగేశ్వర్ రావు, శ్రీశైలం, సురేష్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ డీఈ మానవత్వం..

- అనాథ వృద్ధుడికి నూతన వస్త్రాలు, భోజనం అందజేత



వృద్ధుడిని చేరదీస్తున్న స్థానికులు

టేకుమట్ల: ఓ ప్రభుత్వ అధికారి మానవత్వం చాటాడు. అనాథ వృద్ధుడుని చూసి చలించి కొడుకులా ఆదరించి సపర్యాలు చేశాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని వెలిశాలలో జరిగింది. పంచాయతీ రాజ్ టేకుమట్ల డీఈ ఏ. రవికుమార్ విధుల్లో భాగంగా వెలిశాలకు వచ్చాడు. ఈ సమయంలో బస్సు షెల్టర్‌లో ఉన్న అదే గ్రామానికి చెందిన అనాథ వృద్ధుడు గంధం రమణయ్యను చూసి చలించిపోయాడు. మాసిన బట్టలు, తిండిలేక అలమటిస్తున్న తీరు చూసి చలించాడు. వెంటనే స్థానికుల సహకారంతో వృద్ధుడు ఉంటున్న బస్సు షెల్టర్ పరిసరాలను శుభ్రం చేయించి నూతన వస్త్రాలతో పాటు భోజనం అందించారు. ఒక రోజు కాకుండా ప్రతీరోజు భోజనం అందిస్తాని ఆ వృద్ధుడికి భరోసా ఇచ్చారు. దీంతో పీఆర్ డీఈ రవికుమార్‌ను గ్రామస్తులే కాకుండా మండల ప్రజలు అభినందించారు.

హామీలు వెంటనే నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయ

గోవిందరావుపేట: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని ఉద్యమకారుల మహిళా విభాగం ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ కందిగట్ల జయ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఉద్యమకారుల సంఘం సభ్యుల సమక్షంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా కందిగట్ల జయ హాజరై మాట్లాడారు. ఉద్యమకారులు ఎన్నో కష్టనష్టములను ఓర్చి తెలంగాణ రాష్ట్రం సాధించకున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఉద్యమకారులను ఏ ప్రభుత్వం ఆదుకోలేదని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యమకారులకి నెలకి రూ.25 వేల పెన్షన్, 250 గజాల ఇళ్ల స్థలం ఇవ్వాలని అన్నారు. నేడు(సోమవారం) జిల్లా కేంద్రంలో నిర్వహించే ఉద్యమకారుల శాంతియుత దీక్షలో ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సంధ్య, రాష్ట్ర మహిళా విభాగం కో కన్వీనర్ యాస పూలమ్మ, తుక్కాని సుజాత, తుక్కాని సుగుణమ్మ, నిమ్మల సుహాసిని, కొండి రమేష్, హేమాద్రి, కలమ్మ, ఉపేంద్ర, సమ్మక్క, సరోజని, గీత, మల్లమ్మ, భాగ్యలక్ష్మీ, శకుంతల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉద్యమకారుల దీక్ష

కాళేశ్వరం: తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ (నేడు)సోమవారం ఉదయం 10 గంటలకు మహదేవపూర్ మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో దీక్ష చేపడుతున్నట్లు ఫోరం నాయకుడు అంకారి ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహదేవపూర్ బస్టాండ్ ఆవరణలోని వివేకానంద స్వామి విగ్రహానికి సమీపంలో శాంతియుతంగా కొనసాగే దీక్షలలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొనాలని కోరారు. దీక్షలకు నాయకులు, యువజన సంఘాల నాయకులు, ప్రముఖులు, విద్యావేత్తలు సంఘీభావం తెలపాలని కోరారు.

ఘనంగా గ్రామ దేవతల పండుగ



పూజలు చేస్తున్న గ్రామస్తులు

వాజేడు: మండల పరిధిలోని వాజేడు, నగార, జంగాలపల్లి గ్రామాల్లో ఆదివారం ఎల్ల నంపుడు (గ్రామ దేవతల), విత్తనం పండుగలను ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ పనులకు సన్నద్ధం కావడం కోసం ముందస్తుగా ఈ పండుగలను నిర్వహిస్తారు. అదే విధంగా గ్రామం లోనికి ఎలాంటి దుష్టశక్తులు రాకుండా ఉండటం, పంటలు పుష్కలంగా పండటం కోసం గిరిజనులు తమ సంప్రదాయ పద్ధతుల్లో ఈ పండుగలను చేపడుతారు. గ్రామ దేవతల గుడి వద్ద నుంచి చెక్కలతో తయారు చేసిన చిన్న బండిని పూజల అనంతరం తీసుకువెళ్లి గ్రామాల చివరలో ఉంచారు. అనంతరం గుడి వద్ద మొక్కులను సమర్పించి పంటలు పుష్కలంగా పండాలని కోరుకున్నారు.

ప్రమాదకరంగా సీసీ రోడ్డు



కోతకు గురైన రోడ్డు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చొక్కాల గ్రామంలోని పల్లె ప్రకృతి వనానికి వెళ్లే సీసీ రోడ్డు ప్రమాదంగా ఉంది. గతంలో కురిసిన వర్షాలకు రోడ్డు సైడ్ ఉన్న మట్టి కొట్టుకుపోయి పెద్ద గుంత ఏర్పడింది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు రోడ్డు సైడ్ ఏర్పడిన గుంతకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

అరచేతిలో ‘పంచాయతీ’

- అందుబాటులోకి మేరీ పంచాయతీ యాప్
- ఆదాయ, వ్యయాలను తెలుసుకునే అవకాశం



మొట్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

మొగుళ్లపల్లి: గ్రామ పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులను గ్రామస్తులు తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మేరీ పంచాయతీ(నా పంచాయతీ) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఆదాయ, వ్యయాల్లో పారదర్శకత పాటించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వాలు విడుదల చేసే నిధులను పాలకవర్గాలు ఎలా ఖర్చు చేస్తాయనే సమాచారం నేరుగా తెలుసుకోవచ్చు. యాప్‌ను 2019లో రూపొందించినా సాంకేతిక కారణాలతో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేకపోయింది. ప్రస్తుతం సమగ్ర సమాచారంతో యాప్ అందుబాటులోకి వచ్చింది.

పారదర్శక పాలన

గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులతో అభివృద్ధి పనులు చేపడతారు. వాటి వినియోగానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపర్చాలని, తద్వారా గ్రామాల్లో పారదర్శక పాలన సాగుతుందని అధికారులు చెబుతున్నారు. నిధుల వివరాలు ఆన్‌లైన్‌లో ఉండటంతో గ్రామాభివృద్ధికి ఎలాంటి పనులు చేపడుతున్నారో గ్రామస్తులు తెలుసుకోవచ్చు. వివరాల నమోదు సమయంలోనే జీపీఆర్ఎస్ ద్వారా గుర్తించే అవకాశం ఉండటంతో అక్కడి పనులకు కేటాయించిన నిధులను ఇతర చోట్ల వినియోగించేందుకు వీలుండదు. పాలకవర్గాలు సైతం పొరపాట్లు చేయడానికి అవకాశం ఉండదు. పాలకులు, అధికారులు తప్పుడు నివేదికలు రూపొందిస్తే ప్రశ్నించడానికి వీలవుతోంది.

కొరవడిన అవగాహన

మేరీ పంచాయతీ యాప్ గ్రామస్తులకు అవగాహన కల్పించడంలో అధికారులు వెనుకబడి ఉన్నారు. చాలా వరకు గ్రామాల్లో ఈ యాప్ ఉన్నట్లు కూడా తెలియదు. యాప్‌పై అవగాహన లేక చాలామంది తమ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి వివరాలను తెలుసుకోలేకపోతున్నారు.

పూర్తి వివరాలు..

స్మార్ట్ ఫోన్‌లో ప్లే స్టోర్‌కు వెళ్లి యాప్‌లో మేరీ పంచాయతీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని లాగిన్ కావాలి. ఆ వెంటనే ఫైనాన్షియల్ ఇయర్, స్టేట్, జిల్లా, మండలం, పంచాయతీ వివరాలు కనిపిస్తాయి. వాటిని నమోదు చేయగానే ఆయా పంచాయతీల సమాచారం కనిపిస్తుంది. గ్రామం పేరు, లేద పిన్‌కోడ్‌తో గ్రామ పంచాయతీ పూర్తి వివరాలను తెలుసుకునే వీలుంటుంది. చేసిన పనుల ఫొటోలను యాప్‌లో పొందుపరుస్తారు. పల్లె పాలనలో పారదర్శకతకు ఈసారి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

అందుబాటులో ఉంటుంది



ప్రభుత్వం రూపొందించిన మేరీ పంచాయతీ యాప్‌లో గ్రామాల సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుంది. నిధుల వినియోగంలో లోపాలు ఉన్నా అక్రమాలు జరిగినా యాప్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. ఈ ఆధారాలతో అధికారులకు నేరుగా కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు.

- వీరభద్రయ్య, డీపీఓ

భవన నిర్మాణానికి స్థల పరిశీలన



అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: మండలంలోని బుద్ధారం గ్రామంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణరావు ఆదివారం పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్వహించనున్న అంగన్‌వాడీ భవనానికి అవసరమైన స్థలాలను ఈడబ్ల్యూఐడీసీ డీఈ రామకృష్ణ, ఏఈ జీవన్ కుమార్‌తో కలసి పరిశీలించారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాల ప్రహరీ పునఃరుద్ధరణ పనులు పాఠశాల ప్రాంగణంలో ఓపెన్ జిమ్, సీసీ కెమరాల ఏర్పాటు విద్యార్థుల వసతుల కల్పన కోసం అధికారులను అడిగి తెలుసుకున్నారు. బుద్ధారం గ్రామ బస్టాండు సెంటర్లో కోడవటంచ జాతరకు వెళ్లే లక్ష్మీనరసింహ ఆర్చీ నిర్మాణ పనులకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఆరోపణలు చేస్తే ఊరుకోం..



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కాటారం: మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు నిరాధారణమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి శ్రీధర్‌బాబుకు ఆస్కార్ అవార్డు ఇవ్వాలని పుట్ట మధు విలేకర్ల సమావేశంలో వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. దళితులంతా శ్రీధర్‌బాబు వెన్నంటి ఉన్నారని హైదరాబాద్ నుంచి రాష్ట్ర దళిత నాయకులు సైతం వచ్చి శ్రీధర్‌బాబు గొప్పతనాన్ని, సేవలను కొనియాడారని తెలిపారు. కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాల్లో బీఆర్ఎస్ నాయకులు, పుట్ట మధు తలదూర్చడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, ప్రచార కమిటీ చైర్మన్ కుంభం రమేశ్‌రెడ్డి, నాయకులు గద్దె సమ్మిరెడ్డి, కొట్టె ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



పంబాల పూజారుల నృత్యం



నాయకులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రామాలయం వీధిలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆదివారం ఉదయం పెద్ద పట్నం పూజలు, ఒగ్గు కథల, బలిహరణ కార్యక్రమాన్ని పంబాలపూజారులు చేపట్టారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పట్నంలో కూర్చొని పూజలు చేశారు. అనంతరం మేకలను బలిచ్చి బలిహరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

నాయకుల పూజలు

ముత్యాలమ్మ ఆలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కొబ్బరికాయాలను కొట్టి గ్రామాలను చల్లంగా ఉండే విధంగా చూడాలని వేడుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు లక్ష్మణ్‌బాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్‌రావు, రఘు, ఖాజా, అశోక్, నర్సయ్య, చంద్రబాబు, బోజారావు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇర్సవడ్ల వెంకన్న, చిటమట రఘు తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని ముత్యాలమ్మ కమిటీ సభ్యులు సన్మానించారు.

మహిళలు స్వయం కృషితో ఎదగాలి



వరలక్ష్మిని సన్మానిస్తున్న మహిళలు

ఏటూరునాగారం: ప్రతీ మహిళా స్వయం కృషితో ఎదగాలని జెడ్పీహెచ్ఎస్ రిటైర్డ్ ఉపాధ్యాయురాలు వరలక్ష్మి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలోని ఫంక్షన్ హాల్లో గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. కుట్టు మిషన్ శిక్షణ నేర్చుకున్న ప్రతీ మహిళా ప్రయోజకురాలు కావాలని ఆమె కోరారు. అనంతరం మాజీ జెడ్పీకోఆప్షన్ సభ్యురాలు వలియాబీ మాట్లాడుతూ.. మహిళల్లో అనేక మైన మెళకువలు ఉంటాయని, వాటిని సరైన సమయంలో బయటకు తీయకపోవడం వల్ల వంటింటికి పరిమితం అవుతున్నట్లు తెలిపారు. అనంతరం రిటైర్డ్ టీచర్ వరలక్ష్మిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినర్ రమాదేవి, శైలజ, సుగుణ, ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, వెంకట్రావు, గంజి రమేశ్, మహేష్, చందు, సింధు, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు వెంట ముళ్లపొదల తొలగింపు



ముళ్లపొదలను తొలగింపజేస్తున్న ఎస్సై

ఏటూరునాగారం: మండలంలోని 163 రహదారి వెంట ముళ్లపొదలు ప్రమాదకరంగా మారడంతో ఎస్సై రాజ్‌కుమార్ ఆదివారం జేసీబీ ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ముందస్తుగా చెట్ల తుప్పలు తొలగించామన్నారు. అలాగే రోడ్ల గుంతలను కూడా పూడ్చివేసి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతామని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీటు బెల్ట్ పెట్టుకోవాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ బాలాజీ, కానిస్టేబుళ్లు సుధాకర్, గోపి, విక్రమ్‌లు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బీసీ మర్రిగూడెం గ్రామ శివారుల్లో శనివారం రాత్రి గంజాయిని పట్టుకొని తరలిస్తున్న వారిని అరెస్టు చేశారు. ఆదివారం వెంకటాపురం సీఐ బండారి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బీసీ మర్రిగూడెం గ్రామ శివారుల్లో కొంత మంది వ్యక్తులు గంజాయి తరలిన్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో వెంగళరావుపేట గ్రామానికి చెందిన సాధనపల్లి మౌళి, రంగరాజాపురం కాలనీకి చెందిన ప్రశాంత్‌కుమార్, నేలారిపేటకు చెందిన గుండమల్ల రోహిత్, బెస్తగూడెం గ్రామానికి చెందిన చిడం శివరాం ప్రసాద్, మనికంఠ అనే వ్యక్తులు బీసీ మర్రిగూడెం గ్రామ శివారుల్లో అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకోగా వారి వద్ద నుంచి 1.186 గ్రాముల గంజాయి లభ్యమైంది. కాగా మణికంఠ పరారయ్యాడని తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను విచారించగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో గంజాయి కొనుగోలు చేసి ఇక్కడికి తరలించి అమ్మడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు, ఆవు మృతి



మృతి చెందిన ఆవు వద్ద రోదిస్తున్న స్వామిరావు



మృతిచెందిన దుక్కిటెద్దు వద్ద రైతు సారయ్య

వెంకటాపురం(ఎం): మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన కన్నం సారయ్యకు చెందిన దుక్కి టెద్దు, కేశవపురం గ్రామానికి చెందిన కొలుగూరి స్వామి ఆవు విద్యుదాఘాతంతో వేరువేరు చోట్ల శనివారం మృతిచెందాయి. మేతకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందినట్లు బాధితులు తెలిపారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతోనే మృతిచెందాయని నష్టపరిహారం చెల్లించాలని వారు కోరారు.